క్లుప్తంగా

కృష్ణా కళాశాల అధ్యాపకుడు 'గుడిపాటి'కి డాక్టరేట్



కామర్స్ అధ్యాపకుడు శ్రీనివాసరావును అభినందిస్తున్న ప్రిన్సిపాల్ విజయబాబు

మద్దిలపాలెం: డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల కామర్స్ అధ్యాపకుడు గుడిపాటి శ్రీనివాసరావుకు ఏయూ డాక్టరేట్ లభించింది. మార్కెటింగ్ ఆఫ్ ఫైనాన్షియల్ ప్రొడక్ట్స్ విత్ రిఫరెన్స్ టూ ఈక్విటీ షేర్స్ అండ్ మ్యూచువల్ ఫండ్స్ ఇన్ విశాఖపట్నం అనే అంశంపై ఆయన పరిశోధన చేశారు. ఈ మేరకు ఏయూ వీసీ ఆచార్య శశిభూషణ్‌రావు చేతుల మీదుగా శ్రీనివాసరావు డాక్టరేట్ స్వీకరించారు. ఈ సందర్భంగా బుధవారం కళాశాలలో శ్రీనివాసరావును ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు, అధ్యాపకులు అభినందించారు.

భూలోకమాత ఆలయంలో చోరీ!

ఎంవీపీ కాలనీ: జీవీఎంసీ 15వ వార్డు కొత్త వెంకోజీపాలెం భూలోక మాత ఆలయంలో చోరీ జరిగింది. ఈ మేరకు ఆలయ కమిటీ ప్రతినిధులు బుధవారం పోలీసులకు ఆన్‌లైన్‌లో సమాచారం అందించినట్లు తెలిసింది. అమ్మవారి బంగారు శతమానాల తాడును దండగులు చోరీ చేసినట్లు సమాచారం. మంగళవారం అమ్మవారి పండగ ఘనంగా జరిగింది. జాతర అనంతరం గుర్తు తెలియని వ్యక్తి ఈ దొంగతనానికి పాల్పడి ఉంటాడని భావిస్తున్నారు. బుధవారం ఆన్‌లైన్‌లో ఫిర్యాదు అందుకున్న ఎంవీపీ క్రైమ్ పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. ఘటనపై రాత పూర్వక ఫిర్యాదు ఇవ్వాలని ఆలయ కమిటీ ప్రతినిధులకు పోలీసులు సూచించారు.

'అయ్యంకి'కి ఘన నివాళి



రమణయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న గ్రంథాలయ సిబ్బంది

ఎంవీపీ కాలనీ: గ్రంథాలయ ఉద్యమకారుడు అయ్యంకి వెంకట రమణయ్యకు ఎంవీపీ కాలనీ శాఖ గ్రంథాలయం ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. అయ్యంకి 133వ జయంతి సందర్భంగా బుధవారం ఉదయం గ్రంథాలయంలో ఆయన చిత్ర పటానికి పూల మాల వేసి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా డాక్టర్ పి.శ్రీనివాసరావు మాట్లాడుతూ అయ్యంకి ఉద్యమ స్ఫూర్తితో గ్రంథాలయాలు ప్రతి గ్రామంలోను అందుబాటులోకి వచ్చాయన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి ఉమామహేశ్వరరావు, పబ్లిక్ హెల్త్ సెక్రటరీలు కల్పన, సుభాషిణి, రమ, తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతానికి ఆవు బలి



మృతి చెందిన ఆవు

కొమ్మాది : తెగిపడిన విద్యుత్ తీగ తగలడంతో విద్యుదాఘాతానికి గురై ఓ ఆవు మృతిచెందింది. తుఫాన్ నేపథ్యంలో జీవీఎంసీ 4వ వార్డు కాపులుప్పాడ పరిధి రెడ్డిలపాలెంలో 5 రోజుల క్రితం ఈదురు గాలులకు విద్యుత్ తీగ తెగి పడిపోయింది. దీంతో స్థానికులు ఆ తీగను తొలగించాలంటూ విద్యుత్ శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. ఈ క్రమంలో బుధవారం ఉదయం అటుగా వెళ్తున్న ఆవుకు విద్యుత్ తీగ తగలడంతో అక్కడికక్కడే మృతి చెందింది. విద్యుత్ తీగ తెగిపడి ఉందని ఆ మార్గంలో 5 రోజుల నుంచి తాము రాకపోకలు నిలిపివేశామని రైతు బోర రాజు తెలిపాడు. ఇప్పటికైనా ఆ తీగను అధికారులు తొలగించకుంటే పెను ప్రమాదం తప్పదని, ఇలాంటి విషయాల్లో నిర్లక్ష్యం వహించడం సరైన పద్ధతి కాదంటూ ఆవేదన వ్యక్తం చేశారు.





శిథిలమైన బెంచీలు

బెంచీలిలా.. సేద తీరేదెలా?



విశాఖ అంటే పర్యాటకులకు తక్కున గుర్తొచ్చేది సాగర తీరం. అందులోనూ ఆర్కే బీచ్‌ను సందర్శించకుండా వెళ్లరు అంటే అతిశయోక్తి కాదు. అటువంటి అందమైన తీరంలో మౌలిక వసతులు కరువయ్యాయి. గత ప్రభుత్వం సమకూర్చిన వసతుల నిర్వహణను గాలికి వదిలేయడంతో సందర్శకులు కాసేపు తీరాన సేద తీరేందుకు నానా పాట్లు పడుతున్నారు. కోట్లాది రూపాయలతో గత ప్రభుత్వ హయాంలో తీరం పరిసరాల్లో సందర్శకుల కోసం బెంచీలను ఏర్పాటు చేశారు. వాటి నిర్వహణను అధికారులు పట్టించుకోకపోవడంతో చాలా బెంచీలు శిథిలమైపోయాయి. మరికొన్ని, శిథిల స్థితిలో ఉన్నాయి. దీంతో తీరానికి వచ్చిన సందర్శకులు కాసేపు కూర్చుందామంటే సరైన వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మౌలిక వసతుల కల్పనతో పాటు పాడైన బెంచీలు, కుర్చీలకు మరమ్మతులు చేపట్టాలని నగర వాసులు కోరుతున్నారు. - బీచ్ రోడ్డు

అపార్ట్‌మెంట్‌లో కొండచిలువ హల్‌చల్



షెల్లారులో తిరుగుతున్న కొండచిలువ



కొండచిలువను గోనె సంచిలో బంధించిన అపార్ట్‌మెంట్ వాసులు

ఆరిలోవ: అర్ధరాత్రి వేళ ఆరిలోవలోని ఓ అపార్ట్‌మెంట్‌లో కొండచిలువ హల్‌చల్ చేసింది. వివరాలిలా ఉన్నాయి. అంబేడ్కర్ కూడలి సమీప హిల్‌వ్యూ అపార్ట్‌మెంట్ షెల్లార్‌లో మంగళవారం అర్ధరాత్రి 2 గంటల సమయంలో తిరుగుతున్న కొండచిలువను వాచ్‌మన్ ప్రసాద్ చూశారు. అదే సమయంలో అక్కడున్న ఓ ఆటో డ్రైవర్ కూడా గమనించాడు. ఇద్దరూ అపార్ట్‌మెంట్‌లో ఉన్న వారిని అప్రమత్తం చేశారు. సుమారు 6 అడుగుల పొడవు ఉన్న ఆ కొండచిలువను చూసిన నివాసితులు ఆందోళన చెందారు. పోలీసులు, స్నేక్ క్యాచర్‌కు సమాచారం అందించారు. వారు వచ్చేసరికి సమయం పట్టడంతో స్థానికుల్లో కొందరు ధైర్యం చేసి ఆ కొండచిలువను చాకచక్యంగా పట్టుకుని గోనె సంచిలో బంధించారు. అనంతరం దాన్ని ఇందిరా గాంధీ జూ పార్కుకు అప్పగించారు.

రైతుబజారులో తనిఖీలు



రైతుబజారులో ధరల పట్టికను పరిశీలిస్తున్న మార్కెటింగ్ శాఖ ఏడీ యాసిన్

సీతమ్మధార: సీతమ్మధార రైతుబజారులో బుధవారం జిల్లా వ్యవసాయ, వాణిజ్య మార్కెటింగ్ శాఖ అధికారి షేక్ యాసిన్ తనిఖీలు చేశారు. సబ్సిడీ టమాటాలు విక్రయిస్తున్న రైతుల వద్దకు వెళ్లి టమాటా నాణ్యతను పరిశీలించారు. రైతుల ఐడీ కార్డులు, కూరగాయల ధరల పట్టికను పరిశీలించి మాట్లాడారు. వినియోగదారులకు నాణ్యమైన టమాటాలు అందిస్తున్నామని యాసిన్ తెలిపారు. ప్రస్తుతం టమాటా ధర విపరీతంగా పెరగడంతో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మార్కెటింగ్ శాఖ చిత్తూరు జిల్లా నుంచి టమాటాలను లాభం, నష్టం లేని విధంగా కొనుగోలు చేసి సీతమ్మధార రైతుబజారులో అందుబాటులో ఉంచిందన్నారు. బహిరంగ మార్కెట్‌లో కన్న తక్కువ ధరకు వినియోగదారులకు నాణ్యమైన టమాటాలను విక్రయిస్తున్నట్లు చెప్పారు. ఎస్టేట్ ఆఫీసర్ కొండబాబు, సహాయకుడు సతీష్, రైతులు పాల్గొన్నారు.

జీవీఎంసీ స్థలంలో బడ్డీల తొలగింపు





ఆక్రమించిన స్థలంలో తొలగించిన బడ్డీలు

ఆరిలోవ: పెదగదిలి సమీప గెడ్డ పక్కన ఉన్న జీవీఎంసీ స్థలంలో అనధికారికంగా ఏర్పాటు చేసిన బడ్డీలను అధికారులు బుధవారం సాయంత్రం తొలగించారు. ఇక్కడ గెడ్డ అంచున జీవీఎంసీ, పశు సంవర్ధక శాఖకు చెందిన కొంత స్థలం ఖాళీగా ఉంది. ఈ స్థలాన్ని కొందరు స్థానిక పెద్దలు ఆక్రమించే ప్రయత్నంలో ఉన్నారు. ఇందులో భాగంగా స్థలాన్ని చదును చేసి చిరు వ్యాపారులకు అద్దెకు ఇవ్వగా వారు బడ్డీలు ఏర్పాటు చేసుకున్నారు. దీనిపై స్థానికుల ఫిర్యాదు మేరకు జీవీఎంసీ జోన్–2 అధికారుల ఆదేశాలతో టౌన్ ప్లానింగ్ సిబ్బంది రంగంలోకి దిగారు. బడ్డీలను బుధవారం సాయంత్రం తొలగించారు. విషయం తెలుసుకున్న పశు సంవర్ధక శాఖ జిల్లా జాయింట్ డైరెక్టర్ డాక్టర్ రామకృష్ణ, డీడీ డాక్టర్ కరుణాకరరావు, అధికారులతో కలిసి సదరు స్థలాన్ని పరిశీలించారు. తమ స్థలాన్ని సర్వే చేయించి హద్దులు నిర్ధారిస్తామని జేడీ తెలిపారు.

27 నుంచి ఐసీహెచ్ క్యాంటీన్ల మూత

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లోని ఇండియన్ కాఫీ హౌస్(ఐసీహెచ్) క్యాంటీన్లు ఈ నెల 27 నుంచి మూతపడనున్నాయి. ఈ మేరకు ఉక్కు వెల్ఫేర్ విభాగానికి లేఖ అందజేశారు. స్టీల్‌ప్లాంట్‌లోని అన్ని విభాగాల్లో యాజమాన్యం ఆధ్వర్యంలో క్యాంటీన్లు నిర్వహిస్తున్నారు. ఈడీ (వర్క్స్) బిల్డింగ్ వెనుక ఉన్న కెఫెటేరియాతోపాటు కొన్ని విభాగాల్లో మరో నాలుగు నడుస్తున్నాయి. కొన్ని నెలలుగా మొత్తం ఐదు క్యాంటీన్లకు సుమారు రూ.3 కోట్లు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. యాజమాన్యం బిల్లుల చెల్లింపులు జరపకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఐసీహెచ్ ప్రతినిధి తెలిపారు.

హెల్మెట్ ధారణతో సురక్షిత ప్రయాణం



హెల్మెట్ ధారణపై అవగాహన కల్పిస్తున్న డీఎల్ఎస్ఏ సెక్రటరీ ఎం.వి.శేషమ్మ

మద్దిలపాలెం: ద్విచక్ర వాహనంపై ప్రయాణం చేసే క్రమంలో విధిగా హెల్మెట్ ధరించాలని జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ ఎం. వి.శేషమ్మ అన్నారు. హెల్మెట్ ధారణపై మద్దిలపాలెం ఆర్టీసీ డిపో వద్ద బుధవారం ఆర్టీసీ సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సురక్షితంగా గమ్యం చేరుకోవడానికి హెల్మెట్ తప్పనిసరన్నారు. విధులకు హాజరయ్యేందుకు ఇంటి వద్ద నుంచి వచ్చేటప్పుడు సిబ్బంది విధిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్లాపస్ చైర్మన్ వల్లభనాయుడు, ఆర్టీసీ డిప్యూటీ సీటీఎం జి.సత్యనారాయణ, మద్దిలపాలెం డిపో మేనేజర్ ఎస్.అరుణకుమారి, తదితరులు పాల్గొన్నారు.

విదేశాల్లో విద్యావకాశాలపై అవగాహన



సదస్సులో పాల్గొన్న ఎస్‌ఏపీ మేనేజర్ మోహన్, ప్రిన్సిపాల్ సింహాద్రినాయుడు తదితరులు

డాబాగార్డెన్స్: విదేశాల్లో విద్యావకాశాలపై ఏవీఎన్ కళాశాలలో విద్యార్థులకు బుధవారం సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో రీసోర్స్ పర్సన్‌గా జర్మనీలోని సీమెన్స్ ఎనర్జీకి చెందిన ఎస్‌ఏపీ మేనేజర్ ఏఆర్ మోహన్ పాల్గొని అక్కడి అవకాశాలు, నిబంధనలు, కంప్యూటర్లు, విద్యా విధానంలో డిజిటలైజేషన్, పరిశ్రమల్లోని పరిస్థితుల్ని విద్యార్థులకు క్షుణ్ణంగా వివరించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ఎం. సింహాద్రినాయుడు, డీన్ డాక్టర్ జి. శంకరనారాయణ, భౌతికశాస్త్ర విభాగాధిపతి డి. సంతోష్ కుమార్, జువాలజీ విభాగాధిపతి డాక్టర్ ఎ. అర్చన తదితరులు ప్రసంగించారు. తాజా సాంకేతిక పరిజ్ఞానం, భవిష్యత్‌లో విద్యార్థులు ఎదుర్కొనబోయే వివిధ సవాళ్లను వివరించారు. కార్యక్రమంలో సుమారు 200 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

రైతులకిచ్చిన హామీ నిలబెట్టుకోవాలి



బక్కన్నపాలెంలో నిరసన తెలుపుతున్న భూములు కోల్పోయిన రైతులు

మధురవాడ : కొమ్మాది, బక్కన్నపాలెం, రేవళ్లపాలెం గ్రామాలకు చెందిన భూములు కోల్పోయిన రైతులకు అధికారులు, నాయకులు ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలని రైతులు కోరారు. బుధవారం బక్కన్నపాలెంలోని ఎన్టీఆర్ హుద్‌హుద్ గృహ సముదాయం వద్ద బాధిత రైతులు బుధవారం నిరసన చేపట్టారు. దశాబ్దాల తరబడి పోరాడుతున్న రైతులకు ఇళ్లు ఇవ్వకుండా ఉత్తర నియోజకవర్గానికి చెందిన వారికి ఏపీ స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ సంస్థ ఇళ్లు ఎలా కేటాయించిందని ప్రశ్నించారు. భూములు కోల్పోయిన తమకు ఇళ్లు ఇవ్వకపోవడం అన్యాయమన్నారు. పేద దళిత, బీసీ రైతులకు న్యాయం చేయాలని కోరారు. బాధిత రైతులకు తక్షణమే కాలనీ ఇళ్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వానికి, అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

'నో డెవలప్‌మెంట్ జోన్ నుంచి మినహాయించాలి'

మహారాణిపేట : భీమిలి మండలంలో నేరెళ్లవలస, తొట్లకొండ పరిధిలో నాలుగు గ్రామాలకు సీఆర్‌జెడ్ – 3లో నో డెవలప్‌మెంట్ జోన్ నుంచి మినహాయింపు ఇవ్వాలని పలువురు కోరారు. బుధవారం ఈ గ్రామాలకు చెందిన ప్రజలు కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. భీమిలి మండలంలో చేపలుప్పాడ, కాపులుప్పాడ, నిడిగట్టు, నేరెళ్లవలస గ్రామాలు సీఆర్‌జెడ్ – 3లో నో డవలప్‌మెంట్ జోన్‌లో ఉన్నాయన్నారు. దీని వల్ల ఈ గ్రామాల అభివృద్ధి జరగడం లేదని, జోన్‌ను ఎత్తి వేయాలని కోరారు. భీమిలి ప్రాంతం ప్రగతి సాధిస్తుంటే ఈ నాలుగు గ్రామాలు మాత్రం అభివృద్ధికి ఆమడ దూరంలో నిలిచి పోయాయని కలెక్టర్‌కు వివరించారు. పరిశీలించి న్యాయం చేయాలని కోరారు.

విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్సీ శైలజావల్లి

మధురవాడ : సచివాలయ కార్యదర్శులు బాధ్యతాయుతంగా పనిచేయాలని జోనల్ కమిషనర్ శైలజావల్లి ఆదేశించారు. మధురవాడ జోనల్ కార్యాలయంలో జోన్ పరిధిలోని 9 వార్డులకు చెందిన ఎమినిటీస్ సెక్రటరీలతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ముఖ్యంగా పింఛన్లు సకాలంలో పంపిణీ చేయాలన్నారు. ప్రభుత్వం మారిన దృష్ట్యా వచ్చే కొత్త పథకాలు అమలులో కూడా అంతా కృతనిశ్చయంతో పనిచేయాలన్నారు. విభాగాల అధిపతుల సూచనలు, ఆదేశాలు తప్పకుండా పాటించాలన్నారు. విధుల నిర్వహణలో అలసత్వం వహిస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని, చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ అప్పలరాజు, ఏపీడీ గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

న్యూఢిల్లీ ధర్నాలో వైఎస్సార్‌సీపీ తూర్పు నాయకులు



ధర్నాలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ నాయకులు

బీచ్ రోడ్డు: రాష్ట్రంలో కొనసాగుతున్న అరాచక పాలనకు వ్యతిరేకంగా బుధవారం దేశ రాజధాని న్యూఢిల్లీలో వైఎస్సార్‌సీపీ చేపట్టిన ధర్నాలో ఆ పార్టీ తూర్పు నియోజకవర్గం నాయకులు పాల్గొన్నారు. పార్టీ నాయకులు మొల్లి అప్పారావు, మువ్వల సురేష్, పల్లా దుర్గారావు, పీతల గోవింద్, సంపంగి సురేష్ తదితరులు హాజరై నిరసన కార్యక్రమానికి మద్దతు తెలిపారు.

పర్యావరణహిత జీవనం అలవరుచుకోవాలి



వర్క్‌షాపునకు హాజరైన విద్యార్థులతో అతిథులు

ఎంవీపీ కాలనీ: పర్యావరణహితంగా జీవించడం యువత అలవరుచుకోవాలని భారత ప్రజారోగ్య సంస్థ ప్రతినిధి డాక్టర్ ఎంవీవీ మురళీమోహన్ అన్నారు. ఒడిశాకు చెందిన వ్యూస్ సంస్థ ఆధ్వర్యంలో ఎంవీపీ కాలనీలోని సమత డిగ్రీ కళాశాలలో బుధవారం వాతావరణంపై యువత చైతన్యం అంశంపై వర్క్‌షాపు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్త జీవవైవిధ్య పరిరక్షణ ప్రకృతిపై ఆధారపడి ఉందన్నారు. ప్రకృతి కలుషితం కాకుండా అత్యంత భద్రంగా కాపాడుకున్నప్పుడే భూమిపై జీవకోటి మనుగడ సాధ్యమవుతుందన్నారు. భావితరాలకు కలుషితం కాని ప్రకృతిని అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ దిశగా యువత పెద్ద ఎత్తున కృషి చేయాలన్నారు. వాతావరణానికి, ప్రకృతికి హాని కలిగించని విధంగా జీవించడాన్ని యువత అలవరచుకోవాలన్నారు. అనంతరం ఆయన కళాశాల ప్రాంగణంలోని ఔషధ వనంలోని మొక్కలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ శ్రీనివాసరావు, గ్రీన్ క్లైమేట్ కార్యదర్శి రత్నం, వ్యూస్ సంస్థ సమన్వయకర్త జె.రాజేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

ఆరిలోవ: అంబేడ్కర్‌నగర్ ఫీడర్ ఎస్ఎస్ 11 కేవీ పరిధిలో గురువారం విద్యుత్ నిర్వహణ పనులు జరగనున్నాయి. దీంతో పలు చోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుంది. ఆరిలోవ ఆఖరి బస్టాప్, శ్రీకాంత్‌నగర్, జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీ, కనకమహాలక్ష్మినగర్, పోలీస్ స్టేషన్ ప్రాంతం, టీఐసీ పాయింట్ ప్రాంతాలలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీ ఈపీడీసీఎల్ జోన్–3 ఈఈ పోలాకి శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా ప్రాంతాల ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

రేపు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఎంవీపీ కాలనీ: తూర్పు విద్యుత్ పంపిణీ సంస్థ పరిధిలోని ఎంవీపీ కాలనీ సెక్టార్–1, 2, కొత్త వెంకోజీపాలెం చుట్టు పక్కల ప్రాంతంలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుంది. ఎంవీపీ కాలనీ సెక్టార్–1, 2లోని 11 కేవీ ఫీడర్ నిర్వహణ పనుల్లో భాగంగా ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు సంస్థ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి.సింహాచలం నాయుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

లారీ కింద పడి వ్యక్తి ఆత్మహత్య



గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

ఎంవీపీ కాలనీ: జాతీయ రహదారి సత్యం కూడలిలో లారీ కింద పడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన బుధవారం చోటుచేసుకుంది. ఈ ఘటనపై ఎంవీపీ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సత్యం కూడలిలో బుధవారం తెల్లవారుజామున 6 గంటలకు ముందు ఓ వ్యక్తి బస్సు కింద పడి ఆత్మహత్య చేసుకొనేందుకు ప్రయత్నించగా.. డ్రైవర్ అప్రమత్తమయ్యారు. బస్సును సడన్‌గా ఆపేయడంతో ఆయన ప్రయత్నం విఫలమైంది. బస్సు డ్రైవర్ దిగి అతన్ని రెండు కొట్టి కూడలి సమీపంలో కూర్చోబెట్టి వెళ్లిపోయాడు. స్థానికులు సైతం అతనికి సపర్యలు చేసి వెళ్లిపోయారు. కొద్దిసేపటి తరువాత మళ్లీ ఆ వ్యక్తి జాతీయ రహదారిపై వస్తున్న మరో లారీ వెనక చక్రాల కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల సమాచారం మేరకు ఎంవీపీ పోలీసులు అక్కడికి చేరుకుని పరిశీలించారు. మృతుడి వివరాలు తెలియదని స్థానికులు చెప్పారు. అయితే ఆయన బస్సు కింద పడేందుకు ప్రయత్నించడం, అనంతరం లారీ కింద పడి మృతి చెందిన ఘటనలను పోలీసులకు వివరించారు. గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్యగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు ఎంవీపీ పోలీస్ స్టేషన్‌లో గానీ, 83310 41626 ఫోన్ నంబర్‌లో గానీ సంప్రదించాలని కోరారు.

బడ్జెట్‌లో 'ఉక్కు'కు తీరని అన్యాయం

- కూటమిలో ఉన్నా రాష్ట్రానికి బీజేపీ మొండి చెయ్యి
- టీడీపీ, జనసేన మేల్కొని స్టీల్‌ప్లాంట్‌ను పరిరక్షించాలి
- సిటూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగరావు



మాట్లాడుతున్న సిటూ నాయకుడు నరసింగరావు

అగనంపూడి: కేంద్ర బడ్జెట్‌లో విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు తీరని అన్యాయం చేసిందని సిటూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగరావు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ ఆధ్వర్యంలో కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు 1259వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో పాల్గొన్న నరసింగరావు మాట్లాడుతూ కూటమిలో ఉన్నప్పటికీ బీజేపీ ఏమాత్రం సాయం చేయకుండా విశాఖ ఉక్కుకు, రాష్ట్రానికి తీరని అన్యాయం చేసిందన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలని, పూర్తి సామర్థ్యంతో కర్మాగారం నడిచేలా బడ్జెట్ సహకారం అందివ్వాలని, ఉక్కుకు సొంత గనులు కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. కేంద్రం ఆలస్యం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ భాగస్వామ్య పక్షాలుగా ఉన్న టీడీపీ, జనసేన ఈ విషయంలో మేల్కొని విశాఖ ఉక్కు పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కును ప్రైవేటీకరించబోమని ప్రకటించే వరకు ఉద్యమాలు ఆపేది లేదన్నారు. కార్మికులకు సకాలంలో జీతాలు చెల్లించకుండా కార్మికులను మానసికంగా ఇబ్బందులకు గురి చేస్తున్న ప్రభుత్వం పద్ధతి మార్చుకోకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో స్టీల్ సిటూ అధ్యక్షుడు వై.టి.దాస్, నాయకులు ఎస్.రామారావు, ప్రతినిధులు శ్రీనివాసరాజు, యు.వెంకటేశ్వర్లు, గంగాధర్, నీలకంఠం, టివికె రాజు, సంతోష్, శివ, పూర్ణచంద్రరావు, తదితరులు పాల్గొన్నారు.